## బతుకమ్మ పాట సీడీ ఆవిష్కరణ



బతుకమ్మ పాటల సీడీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 20 : తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ పాట సీడీని శుక్రవారం ఎమ్మెల్యే జోగు రామన్న ఆవిష్కరించారు. ఆదిలాబాద్‌కు చెందిన కళాకారుడు మిట్టు రవి నేతృత్వంలో కళాకారుల బృందం సభ్యులు చిత్రీకరించిన ఈ సంవత్సరం బతుకమ్మ పాట నగదారిలో పాటకు సంబంధించిన సీడీని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పాట చిత్రీకరించిన మిట్టు రవితో పాటు కళాకారుల బృందం సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.

# సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రచారం

జైనథ్, అక్టోబర్ 20 : బడుగు బలహీన వర్గాల అభివృద్ధే బీఆర్ఎస్ ధ్యేయమని మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగోపాల్ యాదవ్ అన్నారు. శుక్రవారం కొత్తగా ఏర్పడిన భోరజ్ మండలంలోని కమాయి, గూడ, పుసాయి గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జోగు రామన్నను ఆదిలాబాద్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. 70 ఏండ్లలో చేయని అభివృద్ధి కేవలం తెలంగాణ ఏర్పడ్డక అనతి కాలంలోనే జరిగిందన్నారు. సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి చేర్చిన ఘనత బీఆర్ఎస్‌దే అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ జిల్లా డైరెక్టర్ పురుషోత్తం యాదవ్, జైనథ్ మార్కెట్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, పుసాయి సర్పంచ్ పోతారెడ్డి, సంజీవ్ పాల్గొన్నారు.



జైనథ్: పుసాయిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



జైనథ్: పూజలు చేస్తున్న మహిళలు

జైనథ్, అక్టోబర్ 20 : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా జైనథ్ మండలం సిర్సన్న గ్రామంలో నవశక్తి దుర్గాదేవి సంఘం ఆధ్వర్యంలో కొలువుదీరిన దుర్గాదేవీకి అర్చకులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆరో రోజు కాత్యాయని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండపం వద్ద మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 20: శాంతినగర్ కాలనీలో ప్రతిష్ఠించిన ఓం శాంతి దుర్గామాత మండపం వద్ద శుక్రవారం మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. మహిళలు మంగహారతులతో హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

## మూల నక్షత్ర వేడుకలు

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 20 : ఆదిలాబాద్ శివారులోని దుర్గానగర్ కాలనీ కొండపై ఉన్న దుర్గామాత ఆలయంలో అమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్ర వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపకుడు కిషన్ మహారాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం వేకువజామున 4 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలతో అంకురార్పణ చేయగా వేద పండితుల మంత్రోచ్చారణలతో విశేష పంచామృతాభిషేకాలు, అలంకరణ నిర్వహించారు. దీక్షాపరులు అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించారు.

## అభివృద్ధిని చూసి ఆదరించండి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కందుకూరి రమేశ్

ఉట్నూర్, అక్టోబర్ 20: తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పల్లెలో అభివృద్ధిని చూసి ప్రజలు ఆదరించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కందుకూరి రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కమాయిపేట్ గ్రామంలో బీఆర్ఎస్ ప్రచారం జోరుగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో గత ప్రభుత్వాలు కనీసం రోడ్డు సౌకర్యం కల్పించలేదన్నారు. కాని నేడు గిరిజన గ్రామాలు గ్రామ పంచాయతీలుగా మారాయని వాటిలో గిరిజనులే సర్పంచ్‌లుగా పరిపాలన చేస్తున్నారన్నారు. అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ రాజు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకులు మహిళలకు క్షమాపణ చెప్పాలి

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 20 : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని, మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు స్వరూప రాణి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు బొడగం మమత, పర్వీన్ ఫెరోజ్‌తో కలిసి ఆమె మాట్లాడారు. తెలంగాణ ఉద్యమాన్ని కించపరిచే విధంగా ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, తాజాగా బతుకమ్మ చీరల పంపిణీపై నాయకుడు కంది శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులకు రూ.కోట్ల ఆస్తులు ఉన్నాయని వారి భార్యలు ఖరీదైన చీరలు ధరిస్తారని, సామాన్య కుటుంబాలకు చెందిన మహిళలకు ప్రభుత్వం బతుకమ్మ పండుగ కానుకగా చీరలు అందిస్తే వారికి కడుపుమంటగా ఉందని వ్యాఖ్యానించారు. బతుకమ్మ చీరలను అవహేళన చేస్తూ కాంగ్రెస్ నాయకులు మాట్లాడిన బీఆర్ఎస్ పార్టీ మహిళా సంఘాలు ఖండిస్తూ మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళా సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. తాజాగా బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టోలో సైతం మహిళలకు ప్రాధాన్యత కల్పించారని, సౌభాగ్య లక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలకు రూ.3 వేల భృతి, రూ.400కే గ్యాస్ సిలిండర్, జీవిత బీమా వంటి హామీలను మ్యానిఫెస్టోలో పొందుపర్చినట్లు తెలిపారు. మహిళల సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్‌కే ఉంటుందని స్పష్టం చేశారు. మహిళా పట్టణ కార్యదర్శి బొడగం మమత, బీఆర్ఎస్ తాలూకా సెక్రటరీ పర్వీన్ ఫెరోస్, పర్వీన్ సుల్తానా, ఉమా మహేశ్వరి, గంగమణి, కరుణ పాల్గొన్నారు.





మాట్లాడుతున్న పట్టణాధ్యక్షురాలు స్వరూప రాణి

## గంగాపూర్ ఎంపీటీసీ బీఆర్ఎస్‌లో చేరిక



ఎంపీటీసీ అర్క రాణీసీతారాంకు బీఆర్ఎస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

ఉట్నూర్, అక్టోబర్ 20 : మండలంలోని గంగాపూర్ ఎంపీటీసీ అర్క రాణీసీతారాం శుక్రవారం ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ విఠల్ దంపతులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గ్రామస్థాయిలో చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లోకి వచ్చామన్నారు. పార్టీలో చేరి మా గ్రామాలు మరింత అభివృద్ధి చేసుకుంటామన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌కే ఆదరణ ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కందుకూరి రమేశ్, కోఆప్షన్ సభ్యుడు రషీద్, సీనియర్ నాయకులు దాసండ్ల ప్రభాకర్, అన్సారి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

నార్నూర్, అక్టోబర్ 20 : మండలంలోని మహదాపూర్ గ్రామానికి చెందిన కాంబ్లే త్రిముఖ్ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం జడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ పరామర్శించారు. త్రిముఖ్ మృతి గల కారణాలను కుటుంబీకులను అడిగి తెలుసుకున్నారు. తనవంతు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నాయకలు కనక ప్రభాకర్, లక్కారాం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, మహేందర్, మెస్రం మానిక్‌రావ్, బాలాజీ, హన్మం త్‌రావు, వెంకటికాంబ్లే ఉన్నారు.

## సిరికొండ ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ఇచ్చోడ(సిరికొండ), అక్టోబర్ 20 : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అమలు చేసిన రైతు దినోత్సవం, ఊరూరా చెరువుల పండుగ, గిరిజన, మంచినీళ్ల పండుగ, సుపారిపాలన, హరితోత్సవం కార్యక్రమాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన బిల్లుల్లో సిరికొండ ఎంపీడీవో సుంకరి సురేశ్ అవకతవకలు పాల్పడి పంచాయతీ కార్యదర్శులకు చెల్లించకుండా సొంతంగా వాడుకోవడం జరిగిందని వాయిపేట్ కార్యదర్శి దుర్గయ్య, రాంపూర్ కార్యదర్శి నాగభూషణ్ శుక్రవారం ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ ఖుష్బుగుప్తాకు వినతి పత్రం ఇచ్చారు. ప్రతి గ్రామ పంచాయతీ కమ్యూనిటీ మరుగుదొడ్లకు సంబంధించిన రూ.20 వేల చొప్పున మూడు రూ.3 లక్షల 20 వేల జమ చేయడం జరిగిందన్నారు. ఈ పథకం రద్దు కావడంతో ఎంపీడీవో అకౌంట్లో జమ చేయడం జరిగిందన్నారు. వాటిని గ్రామ పంచాయతీకి చెల్లించకుండా సొంతంగా వాడుకోవడం జరిగిందని, కార్యదర్శులకు తక్కువ బిల్లు ఇచ్చి ఎక్కువ బిల్లుపై సంతకం తీసుకోవడం జరిగిందన్నారు. సంతకాలు పెట్టని వారిపై బేదిరింపులకు పాల్పడుతున్నారని, ఎంపీడీవోపై చర్యలు చేసుకుంటూ డబ్బును తిరిగి చెల్లించే విధంగా చూడాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

జైనథ్, అక్టోబర్ 20 : మండలంలోని పెండల్‌వాడ ఎక్స్ రోడ్డు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్ర పాఠన్‌బోరికి చెందిన ఉప్పుల్‌వార్ రేయాన్(3) మృతి చెందినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. తండ్రి ఉప్పుల్‌వార్ ఉమేశ్ బైక్‌పై తన కుమారుడు రేయాన్‌ను తీసుకొని తమ బంధువుల ఇంటికి మేడిగూడకు వెళ్లే క్రమంలో జైనథ్ నుంచి రునేశ్ తన బైక్‌తో ఎదురుగా వచ్చి పెండల్‌వాడ వద్ద ఢీ కొట్టడంతో తండ్రి, కొడుకులు ఇద్దరు కిందపడగా రేయాన్ తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. రేయాన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.